# ప్రయాణం

అధిపతి


"కౌసల్యా సుప్రజా రామ....

దేవాలయం లోంచి శ్రావ్యంగా వినిపిస్తోంది మేలుకొలుపు. నిద్రపోతున్న ప్రకృతి కాంతను మేల్కొల్పుతున్నట్లు మధురంగా వినిపిస్తుందా స్వరం.

లేత గులాబి విచ్చుకొన్నట్లు కొండలమాటు నుంచి ఉదయిస్తున్న సూర్యుడు కొత్త పెళ్ళికూతురి నుదుటిపై సింధూరంలా భాసిస్తున్నాడు.

ఏదో అలికిడవడంతో హాయిగా నిద్రపోతున్న ఓ పక్షి కూన ఉలిక్కిపడి తల్లి రెక్కలమధ్య ముడుచుకుపోయింది.

ఊరికి దూరంగా విశాలంగా విస్తరించివున్న చెట్టు కింద చిన్న గుడారం. అప్పుడే వీచిన గాలి తెమ్మరకి అది రెపరెప లాడింది. గుడిలోంచి మంద్రంగా వినిపిస్తున్న సుప్రభాతం వల్ల మేలుకున్నాడు నర్సయ్య. పక్కపై అటూ ఇటూ నిద్రపోలేక కళ్ళు తెరిచాడు.



తననే గట్టిగా కావలించుకొని పడుకొన్న సిన్నోడ్ని పక్కకు జరిపి గుడారం బయటికి వచ్చాడు. ఎదురుగా తన 'సీతా మాలచ్చి' మొహం కడుక్కుంటూ కనిపించింది. రెండు కళ్ళనోమారు నులుముకొని సూర్య భగవానుడి వైపు తిరిగి రెండు చేతులు జోడించాడు నర్సయ్య. పరవశించినట్టు ఉదయరాగాన్ని ఆలపిస్తుంది. ప్రక్కనే పారుతున్న సెలయేరు ఉదయ గీతికలు పాడుతూ రెండు చీలికలు మాయమైనాయి.

'సెంద్రి ఏదే?'

నర్సయ్య ప్రశ్నకు జవాబుగా గల్లు గల్లుమని అందెల సవ్వడి...

అటువైపు తలతిప్పి చూసిన నర్సయ్య, సీతామాలచ్చిలు అప్రతిభులయ్యారు.

రాత్రి కురిసిన వెన్నెల్లో స్నానమాడి నింగిలోంచి నేలపైకి జారిన తారకలా నిడిబడిఉంది. పదహారేళ్ళ సెంద్రి ఆ అందం చూడలేక కాబోలు చంద్రబింబం మబ్బు చాటుకు తప్పుకుంది.

శిలా ప్రతిమల్లా నిలబడ్డ వాళ్ళ దగ్గరికి వచ్చి "ఓరయ్యాగా పిట్టల్ని చూడు ఎంత మురిపెంగున్నాయో" అంటున్న సెంద్రిని దగ్గరికి తీసుకొని నుదుటిపై పెదవులాన్చి తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు నర్సయ్య.

ఆ కళ్ళల్లో లోకాన్ని జయించిన తృప్తి తొణికిసలాడ్తుంది. మాయమర్మం తెలియని కళ్ళతో తండ్రిబంక ఆశ్చర్యంగా చూస్తూ అతని గుండెల్లో ఒదిగిపోయింది సెంద్రీ.

* * *

తోలుబొమ్మలాటకి ఆదరణ క్రమంగా తగ్గుతున్న రోజులవి. కాని ఇలాంటి పల్లెల్లో తోలు బొమ్మలాటల్ని బాగా ఆదరిస్తారు. తోలు బొమ్మలాటల్లో రామాయణం. భారతం వంటి పౌరాణిక గాధలే కాకుండా సాంఘిక గాధల్ని కూడా ప్రదర్శిస్తారు. సాధారణంగా కుటుంబమంతా కలసి కట్టుగా తోలుబొమ్మలాటల్ని ప్రదర్శిస్తుంటారు. వారు పండగలకూ పబ్బాలకూ ఒక్కో ఊరు తిరుగుతూ పొట్ట నింపుకుంటుంటారు.

ఆ ఊరులో జరగబోయే శ్రీ రామనవమి ఉత్సవాలలో తోలుబొమ్మలాట ఆడించడానికి నర్సయ్య కుటుంబం అక్కడికి వచ్చింది. నర్సయ్య భార్య 'సీతా మాలచ్చి', పెద్ద కొడుకు రాముడు. చిన్న కొడుకు పదేళ్ళ సిన్నోడు పదహారేళ్ళ కూతురు సెంద్రీ అదే వాళ్ళ కుటుంబం.

వేసుకున్న గుడారాన్ని ఎత్తేసి తమ సామానంతా సర్దేసి ఊళ్ళోకి ప్రయాణమయ్యారు వాళ్ళు. తనపని దిగ్విజయంగా పూర్తి కావాలని భగవంతుణ్ణి మనస్సులోనే వేడుకుంటూ గ్రామంలోకి అడుగుపెట్టాడు నర్సయ్య కుటుంబసమేతంగా.

* * *

అదో పెద్ద బవనం అది రాజప్రసాదాలను మరిపించేలాగుంది. ప్రవేశద్వారం వద్ద పది మెట్లు హుందాగా ఉన్నాయి. ఆ ఇంటి యజమాని ప్రవృత్తికి సాక్ష్యాలుగా

## యాక్టర్



మాజీ ఎం.ఎల్.ఎ. నరసింహారావుని ఆసక్తిగా ప్రశ్నించాడు విలేకరి.

"సినిమాల్లో నటించాలనే కోరిక మీకెలా కలిగింది?"

"రాజకీయాల్లో నటించి నటించి బోరు కొట్టింది కాబట్టి..."

"ఆఁ...!"

— భూక్యా గోపీనాయక్, చిలకలూరి పేట

మెట్లకిరువైపుల రెండు విశాలమైన అరుగులు. ప్రతి అరుగు కిరువైపుల పెద్ద పెద్ద సింహపు దిమ్మలు. కొత్త వారి నెవరినైనా కంబళించే సింహం గుహ లాగుంది ఆ భవనం.

ఆ ఇంటి ప్రతి భాగంలోనూ దౌర్యనం దిమ్మలనే పూడ్చబడింది. దాన్ని నిర్మించేటప్పుడు వాడినవి నీళ్ళు కాదు. ఆడవాళ్ళ కన్నీళ్లు. అంతటి చరిత్రగల ఆ భవనం ముందు నిలబడి 'అయ్యా బాబయ్యా' అంటూ అరిచాడు నర్సయ్య. లోపలినుంచి హుందాగా వచ్చాడు ఆ ఇంటి యజమాని భూపతి. అక్కడక్కడ నెరసిన జుట్టు గుబురు మీసాలు, పులికళ్ళ లాంటి కళ్ళు. 45 సంవత్సరాలు ఉండవచ్చు భూపతికి. ఎడమ చేత్తో మీసాన్ని దువ్వుకుంటూ ఏమిటన్నట్లు నర్సయ్య వంక చూశాడు. రెండుచేతులు జోడించి నర్సయ్య వచ్చిన సంగతి చెప్పాడు. :"మేం ఇక్కడ తోలు బొమ్మలాడించడానికి వచ్చినామండీ దానికి తమరి అనుమతి కావాలండీ! అంతే కాదండీ మేం ఉండేటందుకు ఏదైనా బస తమరే దయ చూడాలండీ. "తోలు బొమ్మలాటలో ఏమేం ప్రదర్శిస్తారు" అధికార దర్పం ఉట్టిపడేలా హుందాగా అడిగాడు భూపతి.

"రామాయణం, బారతం, కామందుకామం మొదలైవన్ని ఏసేత్తం బాబయ్య".. హుషారుగా చెప్పాడు నర్సయ్య. ఎప్పటి నించి మొదలెడతారు? "మీరనుమతిస్తే ఈవేళ నించే మొదలెడతాం బాబయ్య" జావాబిచ్చాడు. నర్సయ్య.

'ఒరే! రంగా పక్కగది శుభ్రం చేసి వాళ్ళకివ్వు. మీరు అందులోనే ఉండొచ్చు. ఈ వేళ నుండే ప్రారంభించండి" చెప్పి వెళ్ళిపోయాడు భూపతి. నర్సయ్య నమ్రతగా తలవంచి నమస్కరించాడు.

* * *

ఏడు గంటలకు ప్రారంబమయింది ప్రదర్శన. ఆరోజు ప్రదర్శిస్తుంది రామాయణం. ప్రేక్షకులు కళ్ళు ఆర్పకుండా చూస్తున్నారు ఆ బొమ్మల విన్యాసాన్ని. ప్రదర్శన వాళ్ళను విపరీతంగా ఆకర్షిస్తోంది. సీత పాత్ర మాట్లాడే మాటలు మల్లెలు రాలినట్లుగా వినిపిస్తున్నాయి. 'ఎవరు? ఎవరబ్బా మాట్లాడుతుంది?" ప్రతీ ప్రేక్షకుడిలోనూ ఆదే ప్రశ్న.

తోలుబొమ్మలాటల్లో తెరపై బొమ్మకదులుతుంటే వెనుక నుంచి దాని కనుగుణంగా మాట్లాడుతుంటారు. సీత పాత్రకు మాట్లాడుతున్నది. సెంద్రీ.

తాటాకులతో వేసిన పందిరి మద్యగా తెరపై రావణాసురుడు సీతాదేవిని ఎత్తుకుపోయే ఘట్టం ఉత్కంఠంగా జరుగుతోంది.

వెన్నెల పలచగా అలముకున్న రాత్రులు. చూడలేకపోయినా మాటలు వింటున్న ఆ నందంతో చెట్లు తమ తలలను తన్మయత్వంలో ఊపుతున్నాయి.

మద్యగా మంచాలను నిలబెట్టారు. అటువైపు ఆడవారు ఇటువైపు మగవారు. అంతవరకు మరదళ్ళతో సరసాలాడిన కుర్రకారు ఆట ప్రారంభం కావడంతో మంత్రముగ్ధులై ప్రదర్శనలో లీనమయ్యారు.

వారికి దూరంగా వాలు కుర్చీలో కూర్చొని చూస్తున్న భూపతి కళ్ళల్లో అదోరకమైన ఆకలి ప్రజ్వరిల్లింది. పెదాలను నాలుకతో తడుపుకుంటున్నాడు.

"రంగా" పిల్చాడు భూపతి. వినయంగా ఎదుట నిలిచాడు. రంగడు.

'ఈ వాల్టికి వాళ్ళకు మనింట్లోనే బోజనం ఆ ఏర్పాట్లు చూడు. పురమాయించాడు భూపతి.

తెరపై రావణాసురుడు సీతమ్మను ఎత్తుకు పోతున్నాడు. భూపతి కళ్ళు రావణాసురిడి కళ్ళలా మెరుస్తున్నాయి.

* * *

విస్తరిలోని పదార్థాలను ఆబగా తింటున్నాడు. సిన్నోడు. అంతలో భూపతి లోనికొచ్చాడు "భోజనం బాగుందా". అడిగాడు భూపతి

"బాగుంది బాబయ్య" నర్సయ్య సమాధానం.

"అవును గానీ ప్రదర్శనలో సీతమ్మకు మాట్లాడిందెవరు?". సెంద్రివంక చూపిస్తూ "ఇదేనండి? మా పిల్ల సెంద్రీ !" వినయంగా చెప్పాడు నర్సయ్య. సెంద్రీ వంక పరిశీలనగా చూశాడు భూపతి, పదారేళ్ళ పడుచుప్రాయం. మిసమిసలాడుతున్న అందం. లేడికళ్ళు, పొంగిన బుగ్గలు భూపతిలోని మృగం రెక్కలు విప్పుకుంది.

* * *

మరుసటిరోజు మద్యాహ్నం నుంచి ఎడతెరపలేని వాన భూపతి మేడమీద వసరాలోకి వచ్చాడు. అతని దృష్టి నర్సయ్య ఇంటిపై పడింది. ఇంటిబయట ఆనందంగా గెంతుతిన్న సెంద్రీ. వర్షపు చినుకుల్లో సంతోషం పట్టలేక ఎగురే లేడిపిల్లలా.

తడసిన కొంగుమాటు నుండి కనిపిస్తున్న లేత అందాలు. వీనస్ బొమ్మమీద నీటిబొట్టులా ఆమె శరీరంపై నీటిబొట్లు మెరుస్తున్నాయి. ఆమెవైపే గుడ్లప్పగించి చూస్తున్నాడు భూపతి.

* * *

ఎంత చెప్పినా నిన్న వినిపించుకోలేదామె? చూడు ఇప్పుడు ఏం జరిగిందో. వర్షంలో తడిసింది. 'ఈ

రోగాన్ని తెచ్చుకుంది ఇప్పుడెవరు మాట్లాడుతారు? విసుక్కుంది సీతామాలచ్చి.

"నువ్వున్నావు కదటే? అయినా సిన్న పిల్ల దాని మీద ఎందుకలా ఇడుచుకు పడతావు. ఈరోజుకు నువ్వు మాట్లాడుదువుగాని లే పద సమయం మించిపోతుంది. పదపద !" అంటూ తొందరచేశాడు నర్సయ్య.

కళ్ళు తెరవలేని జ్వరంతో వున్న సెంద్రి నుదుటిని ప్రేమగా ముద్దాడి ప్రయాణమయ్యారు. ప్రదర్శనకు.

* * *

ఆ ఇంట్లోకి పెద్దపులిలా ప్రవేశించాడు భూపతి. మంచంపై శవంలా పడివున్న సెంద్రి దగ్గరకు చేరాడు. ఆమె అందాలనోమారు నిమిరి ఆమెపై గోద్దులా పడ్డాడు.

* * *

కామందుబొమ్మ గంగబొమ్మ దగ్గరికి వస్తుంది.. 'వద్దు, వద్దు నన్నంనేసేయక, నాబతు కన్యాయం సేయక' బ్రతిమాలుకుంటుంది గంగబొమ్మ. కామందు గంగపై పడ్డాడు. గంగనేల కొరిగిపోయింది ప్రేక్షకులు కళ్ళు మూయకుండా చూస్తున్నారు.

* * *

సెంద్రినోటి నుండి ఒక్క మూలుగు వినిపించింది. భూపతిలేచి బట్టలు సర్దుకున్నాడు. ఇంట్లోంచి బయటికి నడిచాడు. సెంద్రి శరీరంలో చలనంలేదు. ఇంట్లోకి ప్రవేశించిన నర్సయ్య కుటుంబానికి సెంద్రి శవం కనిపించింది. నర్సయ్య గొల్లుమన్లేదు. పక్కనే వున్న భూపతి పులిగోరు వంక కసిగా చూశాడు.

* * *

"పాపం మొన్న రామాయణానికి మాట్లాడిన మ్మాయే. జ్వరంతో సచ్చిపోయిందంట. ఎంతబాగా మాట్లాడిందని పదారేళ్ళు వుంటాయేమో అపుడే నూరేళ్ళు నిండిపోనాయి" 'తలా ఒక్కమాట అంటున్నారు.

ఇక్కడే దహనం చేసినారు. ఇపుడు మిగిలినోళ్ళు వెళ్ళిపోతున్నారు అక్కడకొచ్చిన ప్రతివాళ్ళ కళ్ళల్లో అదోలాంటి ఆత్మీయత.

"ఒరే రాముడూ ఆ మేకను కోసిన కత్తికి ఇంకా రక్తం ఉన్నట్టుంది కడిగేసి అందులో పడేయ్ !" అందరూ పయనమయ్యారు.

ఈ ఊరిలో ప్రవేశించబోయేముందు తమ కెదురయిన ఏరు ఎదురయింది. రాముడు గోనెసంచె దింపాడు అందులో వేరయిపోయివున్న భూపతి. తలా, మొండేన్ని అందులో కలిపేశాడు. వాళ్ళ ప్రస్థానం సాగిపోతోంది. మనిషికి మనిషి. అన్న సిద్ధాంతంతో సృష్టిరహస్యాన్ని తనలో ఇముడ్చుకున్న ఏరు పారుతోంది భూపతి శవంతో బాటు ——

●

# ఎడమ చేతివాటం

ప్రపంచ జనాభాలో సుమారు 10 శాతం మంది పుర్రచేతివాటం ప్రదర్శిస్తారు. అసలు పుర్రచేతివాటం అంటే ఏమిటి? మనం పన్లు చేసేటప్పుడు రెండు చేతులూ ఉపయోగిస్తాం. కాని తినడం, రాయడం వంటి పనులకు కుడిచేతినే ఎక్కువగా వాడతాం. అలాగే కత్తెర, సుత్తి వంట చేసేప్పుడు గరిటెలు మొదలైన పరికరాలు కూడా కుడిచేత్తోనే ఎక్కువగా ఉపయోగిస్తాం. కాని పుర్రచేతి వాటం వున్నవారు ఇటువంటి పనులన్నింటికీ ఎడమ చెయ్యి ఎక్కువగా వాడతారు. అలాగే క్రికెట్, టెన్నిస్ ఆటలు ఆడేవారు పుర్రచేతి వాటంగలవారు బాట్ పట్టుకుందుకు ఎడమ చేతినేవాడతారు. అగ్గిపుల్ల గీసేటప్పుడు, సూదిలో దారం ఎక్కించేటప్పుడు కూడా ఎడమ చేతినే వాడతారు.

స్త్రీలలో కన్న పురుషులలో పుర్రచేతి వాటం ఎక్కువగా కనిపిస్తుంది. పుర్రచేతి వాటం జన్యువుల చేత నిర్ణయించబడుతుందనడానికి కొన్ని నిదర్శనాలున్నాయి. కాని పుర్రచేతి వాటం ఎప్పుడూ కొన్ని కుటుంబాలలో ఆనువంశికంగా వుంటుందనడానికి వీలులేదు. ఆనువంశికం కాకుండా దీనికి ఇతర కారణాలు కూడా ఉండవచ్చు.

అయితే పుర్రచేతివాటంగల వారి మెదడులు కుడిచేతి వాటం గల వారి మెదడులకు భిన్నంగా పనిచేస్తాయని పరిశోధకులకు చాలాకాలంగా తెలుసు. మెదడులో ఒక అర్ధగోళం రెండోదాని కన్న ప్రబలంగా వుండడం వల్ల కుడిచేతి వాటంగాని పుర్రచేతి వాటంగాని వస్తుంది. కుడిచేతి వాటం గల వారికి ఎడమ అర్ధగోళం ప్రబలంగా వుంటుంది. కాని పుర్రచేతివాటం గల వారిలో ఏ అర్ధగోళం ప్రబలంగా వుంటుందో అంతనిశ్చితంగాతెలియదు. మెదడు అభివృద్ధిలో పుర్ర చేతి వాటం వచ్చేట్లు చేసేదిఏం జరిగినా అది ఆ వ్యక్తికి కొన్ని అసామాన్య మానసిక లక్షణాలను ప్రసాదిస్తుంది — వీటిలో కొన్ని మంచివి, కొన్ని లోపాలు కావచ్చు. పుర్రచేతి వాటం గల వారికి డిస్ లెక్సియా అనే పరిస్థితి కొంచెం ఎక్కువగా వుంటుంది. అంటే మాటలలో అక్షరాలు, అంకెలు తారుమారు చేయడం. కాని గణితంలో వారు అసాధారణ ప్రజ్ఞ చూపిస్తారు. వివిధ రంగాలలో ప్రసిద్ధులైన వారిలో చాలా మంది పుర్రచేతివాటంగల వారున్నారు. ఉదాహరణకి ఆల్బర్ట్ ఐన్‌స్టెయిన్, మార్లిన్ మన్రో, మార్టినా నవరతిలోవా, ఛార్లి ఛాప్లిన్, జార్జ్ బుష్, పాబ్లోపికాసో, బెంజామిన్ ఫ్రాంక్లిన్, విక్టోరియా రాణి, రోనాల్డ్ రీగన్ మొదలైనవారు. పుర్రచేతి వాటం గల వారి ఆయు ప్రమాణం తక్కువగా వుంటుందని ఒక సిద్ధాంతం వుంది. కాని పైన పేర్కొన్న ప్రసిద్ధులంతా 80 సంవత్సరాల పైబడి జీవించినవారే.

మెదడుకు కుడి వైపున గాయం తగలడం వల్ల పుర్రచేతి వాటం రావచ్చునని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఒక్కొక్కప్పుడు కాన్పు సమయంలో శిశువు మెదడుకు గాయం తగలవచ్చు. మూడు, ఆరు సంవత్సరాల మధ్య వయసు పిల్లలలో పుర్రచేతి వాటమా కాదా అనేది రూఢి అవుతుంది. పుర్రచేతి వాటం వున్న స్త్రీలలో రజస్వల ఆలస్యమవుతుందని, పురుషులలో కూడా యవ్వన లక్షణాలు కొంచెం ఆలస్యంగా కనబడతాయని ఒక వాదం వుంది.

ఈ ప్రపంచంలో అన్ని వస్తువులు కుడి చేతి వాటం గల వారికి అనుకూలంగా వుండేట్లు రూపుదిద్దుకున్నాయి. అందువల్ల పుర్రచేతి వాటం గల వారు నిత్య జీవితంలో కొన్ని ఇబ్బందులు, ప్రమాదాలు ఎదుర్కొంటారు. ముఖ్యంగా ఫ్యాక్టరీలలో పనిచేసే వారి విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. రంపంతో కోయడం, డ్రిల్లింగ్ చేయడం, వంటి పనులు పుర్రచేతి వాటం గల వారిని ఆ అలవాటు తప్పించుకుని కుడిచెయ్యి అలవాటు చేసుకోమనడం సమంజసమా? కాదు. ఎందుకంటే అది కేవలం ఒక అలవాటు కాదు. ఇది మెదడులో నాడుల అమరికకు సంబంధించి వుండవచ్చు. అది జన్మతః వచ్చి వుండవచ్చు. లేదా మెదడుకి గాయం తగలడం వల్ల కావచ్చు. ఏది ఏమైనా వారిని కుడిచేతితో పనిచేయమంటే జరిగేపని కాదు.

పుర్రచేతి వాటం గల వారి సంఖ్య తక్కువకావడం వల్ల వారిని ఎవరూ అంతగా గమనించరు. బాగా సన్నిహితంగా వున్న వారికి తప్ప మిగిలినవారికి ఆ సంగతి అసలు తెలియకపోవచ్చు. అంతేకాదు చాలా మంది పుర్రచేతివాటం గల వారు తమ సంగతి ఇతరులకు తెలియకుండా ఉండాలనే కోరుకుంటారు. ఇందుకు అనేక కారణాలుండవచ్చు.

భాష నేర్చుకునే శక్తికి పుర్రచేతి వాటానికి కొంత సంబంధం వుండవచ్చని ఇటీవలి పరిశోధనల వల్ల తెలుస్తోంది. మామూలుగా కుడిచేతి వాటం గల వారిలో భాషానియమాల జ్ఞానం మెదడు ఎడమ అర్ధగోళంలో వుంటుందని, కాని పుర్రచేతివాటం గల వారిలో ఈ శక్తిని రెండు అర్ధగోళాలు పంచుకుంటాయని వారంటారు.

ఏది ఏమైనా చాలా మంది పుర్రచేతి వాటం గలవారు వివిధ రంగాలలో అసాధారణ ప్రజ్ఞ ప్రదర్శించడం మనం చూస్తున్నాం.

—— ఆర్.ఎల్